

బీటీ రోడ్డు ధ్వంసం

భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం సమీపంలోని జోడువాగుల వద్ద గత సంవత్సరం నిర్మించిన సింగిల్ రోడ్డు వాహనాల రద్దీ కారణంగా ధ్వంసం అవుతోంది. వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. జోడువాగుల వద్ద దాదాపు రెండు కిలోమీటర్లు కొత్తగా రెండువరసల రోడ్డు నిర్మించకపోవడంతో, ఈ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

నెన్నెల: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రాంతంలో రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పట్టణాలకు వెళ్లేందుకు ఈ దారే ప్రధాన మార్గం కావడంతో వాహనదారులు ఇరువైపులా రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్‌ను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆదమరిస్తే అంతే..!

భీమారం: మండల కేంద్రంలోని రైతువేదిక వెళ్లే రోడ్డులో వరద నీళ్లు వెళ్లేందుకు అధికారులు పైపులు వేశారు. పైపుల పై నుంచి కల్వర్టు నిర్మించకపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేయగా, వర్షాలకు కోతకు గురైంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురికావాల్సిందే..అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదకరంగా ఉన్న వద్ద కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

బీరయ్య దేవుడి పట్నాలు



బోనాలతో భక్తులు

దండేపల్లి: మండలంలోని రంగంపల్లెలో సోమవారం బీరయ్య దేవుడి, బోనాలు, పట్నాల వేడుకలు నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం భక్తులు బీరయ్యకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 24న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గణేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెండావెంకటాపూర్, బలరావుపేట, తిమ్మాపూర్ గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధ్రువపత్రాల కోసం సంప్రదించండి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల ప్రతిభ జూనియర్ కాలేజీలో చదివిన విద్యార్థులు వారి బదిలీ ధ్రువపత్రాలు(టీసీ)ల కోసం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కార్యాలయంలో సంప్రదించాలని, ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర ఏ సమస్యలు ఉన్నా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, నస్పూరులోని రెండో అంతస్తులో గల ఎస్4 రూంలో గల తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఒకరి బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్దిపల్లి గ్రామానికి చెందిన దోసాల ఆదిత్య అనే యువకుడిని హాజీపూర్ పోలీసులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాస రావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు. గతంలో ఆదిత్య ఒకరిపై భౌతిక దాడికి పాల్పడినందునా, మరోసారి అలాంటి నేరానికి పాల్పడకుండా సత్ప్రవర్తన కోసం బైండోవర్ చేశారు. రూ. ఒక లక్ష జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష కింద ఒక సంవత్సర కాల వ్యవధి కోసం బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ టి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మంచిర్యాల డిపో పరిధిలో నడిచే బస్సుల సమయాలు, మార్పులు, చేర్పులపై ప్రజలు 9959226004 నంబరులో తెలియజేయాలని, సూచనలు, ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

ప్రాజెక్టు అధికారికి సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా చేసి జీఎం మార్కెటింగ్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న టీ.శ్రీనివాస్‌ను ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జీఎం పాల్గొని ఆయన్ను సత్కరించి ఆయన ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్సా, ఐకే ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు



బెల్లంపల్లి: బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆయన అనుచరులకు వ్యతిరేకంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ఫ్లెక్సీలు వెలిశాయి. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు ఎదురుగా, మహిళా కమిషన్, ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యాలయాల వద్ద ఆరిజిన్ డెయిరీ యాజమాన్యం, బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల పేరుతో ఫ్లెక్సీలు కట్టారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారు మీ పార్టీ ముసుగులో జరుగుతున్న అరాచకాలను ఆపి గిరిజన మహిళలకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. చిన్నయ్య, మానవ అక్రమ రవాణాలో నిందితులుగా ఉన్న పార్టీ నాయకులను సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు. ఫ్లెక్సీల ఫొటోలు బెల్లంపల్లిలోని వాట్సాప్ గ్రూపులో వైరల్‌గా మారాయి. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లాలో ఒక గిరిజన మహిళ మిస్సింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు ఉన్నారని ఆరోపించారు.

ప్రతిపాదనలకే పరిమితం!

- అంతర్గత రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు
- ఏళ్లుగా ముందుకు సాగని పనులు
- బెల్లంపల్లి మున్సిపల్‌లో పెరుగుతున్న రద్దీ
- అధికారుల అలసత్వంతో రాకపోకలకు ఇబ్బందులు



పోచమ్మ గడ్డ చౌరస్తాకు వెళ్లే మార్గంలో జరిపిన తవ్వకాలు

బెల్లంపల్లి: ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఏళ్లు గడుస్తున్నా అంతర్గత ప్రధాన రోడ్ల విస్తరణ జరగడం లేదు. తీవ్ర కాలయాపన చేస్తున్నారు. ఏళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడంతో, ఎప్పటికి రోడ్ల విస్తరణ జరుగుతుందో అనే అనుమానాలు పుర ప్రజలు, వాహనదారుల్లో వ్యక్తమవుతుండగా రోడ్లు వెడల్పు లేక రాకపోకలు సాగించడానికి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

విస్తరించాల్సిన రోడ్లు ఇవే..

పాతబస్టాండ్ వద్ద నుంచి శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల మీదుగా అంబేద్కర్‌నగర్‌కు వెళ్లే రోడ్డు, అంబేద్కర్ (కాంటా) చౌరస్తా వద్ద నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోశమ్మ గడ్డ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని ప్రతిపాదించి కొన్నాళ్ల క్రితం మున్సిపల్ తీర్మానం చేశారు. ఆయా రోడ్ల విస్తరణ కోసం రూ.1.40కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ వీటి జోలికి వెళ్లడం లేదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రోడ్లను వెడల్పు చేయాల్సిన అవసరం ఉన్నా, పట్టింపులేని ధోరణిని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు పురప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఏటా ఓ సారి రోడ్ల విస్తరణకు సిద్ధపడటం, ఆ తర్వాత అర్ధంతరంగా వదిలేయడం పరిపాటిగా మారింది. తాజాగా అంబేద్కర్ చౌరస్తా వద్ద నుంచి పోశమ్మ గడ్డ చౌరస్తా వరకు వెళ్లే రోడ్డును వెడల్పు చేయడానికి మార్కింగ్ చేసి కొద్ది మొత్తంగా తవ్వకాలు చేపట్టి ఆపేయడంతో ఈ సారి కూడా రోడ్ల విస్తరణ జరిగేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

స్పందించని అధికారులు...

రోడ్ల విస్తరణ కోసం ప్రతిపాదిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన పలు కట్టడాలను కూల్చివేయాల్సి ఉంటుంది. ఇందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు కార్యాచరణ తయారు చేసి అమలు చేయాల్సి ఉన్నా స్పందించడం లేదు. రోడ్లను 40ఫీట్ల వరకు వెడల్పు చేయాలని తొలుత ప్రతిపాదించారు. ఆ తర్వాత 36ఫీట్లకు కుదించారు. అయితే రోడ్డు విస్తరణతో తమకు అన్యాయం జరుగుతుందని పలువురు మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నారు. దీంతో తాజాగా 26ఫీట్ల వెడల్పుతో రోడ్డు పనులు చేపట్టాలని సూచనప్రాయంగా ఓ నిర్ణయానికి వచ్చినట్లు అనధికారిక సమాచారం. భవిష్యత్ అవసరాలు, జన నివాసాలకు జరిగే నష్టాన్ని అంచనా వేసి అందరి ఆమోదంతో తుది నిర్ణయం తీసుకొని పనులు ప్రారంభించడానికి మున్సిపల్ అధికారులు ఏమాత్రం శ్రద్ధ లేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై వివరణ కోరేందుకు 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



వేమనపల్లి: ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ వెంకటేశ్వర్లు

వేమనపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. వేమనపల్లి మండలం నీల్వాయిలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. యువత గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తుపదార్థాలకు బానిస అవుతున్నారని, దీంతో సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు కారకులవుతున్నారన్నారు. మత్తు పదార్థాల వల్ల శారీరకంగా జరిగే అనర్థాల గురించి వివరించారు. మత్తులో యువత చేసే చట్టవ్యతిరేక కార్యకలాపాల వల్ల జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతీ విద్యార్థి తమ కుటుంబాల, తల్లిదండ్రులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎదుట మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం శశిధర్‌రెడ్డి, ఎస్సై శ్యాంపటేల్, పీడీ మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి/నస్పూర్/కాసిపేట/లక్సెట్టిపేట/భీమిని/శ్రీరాంపూర్/కోటపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాండూర్ సీఐ కుమారస్వామి, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వేణుచందర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ బాలుర కళాశాలలో షీ టీం విభాగం ఆధ్వర్యంలో షీ టీం సీఐ నరేశ్, లక్సెట్టిపేట మున్సిపల్ పరిధి గుడ్‌షెప్పర్డ్ పాఠశాలలో ఎస్సై గోపతి సురేష్, విలేజ్ నస్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో సీసీసీ నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు, కోటపల్లి మండలకేంద్రంలోని మోడల్ స్కూల్లో ఎస్సై రాజేందర్, కాసిపేట మండలంలోని మల్కేపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎస్సై ఆంజనేయులు మత్తు పదార్థాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని గంజాయి, ఇతర చెడు వ్యసనాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్ కోల్పోవద్దని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట/భీమారం/శ్రీరాంపూర్/చెన్నూర్/మంచిర్యాలటౌన్: బీజేపీ ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, బెల్లంకొండ మురళి, కర్రె లచ్చన్న, కృష్ణమూర్తి, పెద్దపల్లి పురుషోత్తం, కొయ్యల ఏమాజీ, మల్లారెడ్డి, గోలిరాము పాల్గొన్నారు. లక్సెట్టిపేట మండలంలోని కొమ్ముగూడెంలో మండల ప్రధాన కార్యదర్శి బొక్కినపెల్లి సతీష్ పాల్గొనగా, భీమారం మండల కేంద్రంలో జిల్లా నాయకులు మాడెం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ కృష్ణాకాలనీలోని శక్తి కేంద్రంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సత్రం రమేశ్, ప్రధాన కార్యదర్శి బద్రి శ్రీకాంత్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి మొగిలి, శక్తి కేంద్రం ఇన్‌చార్జీ రాగిడి రవి పాల్గొన్నారు. చెన్నూర్ పట్టణంలో పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్ ఉన్నారు.

జలశక్తి అభియాన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఎంపీడీవో

జన్నారం: మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, సింగరాయపేట, చింతగూడ, మల్యాల, పొనకల్, బాదంపల్లి, మురిమడుగు, వెంకటాపూర్, కలమడుగు, మొర్రిగూడ, ఇందన్‌పల్లి, కామన్‌పల్లి, కిష్టాపూర్, కవ్వాల్ గ్రామాల్లో జలశక్తి అభియాన్ పనులను కేంద్ర బృందం శాస్త్రవేత్త రాంబాబు సోమవారం పరిశీలించారు. జలశక్తి అభియాన్ ద్వారా మండలంలో 2024-25లో చేపట్టిన 71 పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వ్యక్తిగత సామాజిక ఇంకుడు గుంతలు, ఫారం పాండ్స్, కుంటలు, రూట్ ఆఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కార్యాలయ సిబ్బంది సత్యనారాయణ, సదానందం, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఏపీవో రవీందర్, ఈసీ విలాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులు ఆపేలా చూడండి సారూ!



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీపూర్ గ్రామస్తులు

కోటపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామం మీదుగా కాళేశ్వరం సిరోంచ వెళ్లే బస్సులు లక్ష్మీపూర్ గ్రామం వద్ద ఆపాలని సోమవారం తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపూర్ గ్రామస్తులు మాట్లాడుతూ కాళేశ్వరంకు లక్ష్మీపూర్‌కు వెళ్లే బస్సులు కొల్లూర్, రాంపూర్, బబ్బురుచెల్క, లక్ష్మీపూర్ వద్ద ఆపడంలేదని, ఆర్డినరీ బస్సుకే ఎక్స్‌ప్రెస్ టికెట్ వసూల్ చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ అధికారులు బస్సు డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేసేలా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి బస్సు ఆపేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో సమీప గ్రామల ప్రజలందరూ కలిసి రోడ్డుపై పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ప్రజావాణిలో ఎంపీవో అజ్మత్‌అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఐకేపీ ఏపీఎం ప్రమీల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



చెన్నూర్ పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న సీఐ

భీమారం/చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు అన్నారు. మానవ మనుగడకు మొక్కలు దోహదం చేస్తాయని తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి హరితహారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. హాజీపూర్, చెన్నూర్, భీమారం పోలీస్‌స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో భీమారం ఎస్సై శ్వేత, హెడ్ కానిస్టేబుల్ మాచర్ల, చెన్నూర్‌లో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, హాజీపూర్‌లో ఎస్సై స్వరూప్‌రాజ్, ప్రధానోపాధ్యాయులు సుధారాణి, బన్న రవీందర్, రామన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధే లక్ష్యం

- అలరించిన ఫుడ్ ఫెస్టివల్



వంట పదార్థాలు పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూర్: స్వయం సహాయక సంఘాలు సూక్ష్మ రుణాలు పొంది అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ అందరినీ అలరించింది. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసి ప్రదర్శించిన వివిధ రకాల వంటకాలు ఆకట్టుకున్నాయి. 25స్టాళ్లలో వెరైటీ ఫుడ్స్ ఏర్పాటు చేయడంతో ఒక్కో అధికారి సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు కొనుగోలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో టీఎంసీ రామకృష్ణ, బ్యాంక్ మేనేజర్లు దీపక్‌సింగ్, శ్రీనివాస్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పాగుల సతీశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాలం చెల్లిన బస్సులు సీజ్ చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని విద్యాసంస్థలకు చెందిన కాలం చెల్లిన బస్సులను సీజ్ చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో జిల్లా రవాణాశాఖ అధికారులకు సోమవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, నాయకులు రమేశ్, సందేశ్ పాల్గొన్నారు.

మహిళా సంఘ భవనంలో విద్యుత్ ప్రమాదం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామ పంచాయతీ భవనంలోని గ్రామైఖ్య సంఘ కార్యాలయంలో సోమవారం ఉదయం విద్యుదాఘాతం చోటు చేసుకుంది. భవనంలో ఉన్న టీ-ఫైబర్ పరికరాల్లో విద్యుదాఘాతం జరగడంతో టీ-ఫైబర్ పరికరాలతో పాటు పక్కనే ఉన్న కుర్చీలు, ఫ్యాన్లు, ఫర్నీచర్, ఫాగింగ్ మిషన్‌లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.

పాఠశాలలపై ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు సోమవారం విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అడ్మిషన్ల పేరిట, పుస్తకాలు, బట్టలు, టై, బెల్ట్, షూ తీసుకోవాలని ఒత్తిడి చేస్తూ పాఠశాలలు వేల రూపాయలు దండుకుంటున్నాయని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సికిందర్, గణేష్ పాల్గొన్నారు.


ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

తాండూర్: రైతులకు ఎరువుల కొరత లేకుండా జిల్లా వ్యవసాయ అధికారులు తగురీతిన చర్యలు తీసుకోవాలని మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు తీర్మానం చేశారు. పీఏసీఎస్ కార్యాలయంలో సింగిల్‌విండో చైర్మన్ సుబ్బాదత్తుమూర్తి అధ్యక్షతన సోమవారం సంఘ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ కడారి రత్నాకర్ రావు, డైరెక్టర్లు గట్టు మురళీధర్‌రావు, సామాడి తిరుపతి, పూసల రాజేషం, రవుఫ్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జైపూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ముస్తఫా మహిళా సంఘాల సభ్యులకు వివరించారు. ఐకేపీ కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, వీవో లీడర్స్, మండల సమైక్య లీడర్లు, సీసీలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

పాతమంచిర్యాల: జులై 01న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 60మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఉద్యోగులకు రీజినల్ మేనేజర్ రితీష్ కుమార్ గుప్తా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ హెచ్ఆర్ మేనేజర్ సుమంత్ రెడ్డి, చీఫ్ మేనేజర్ అలోక్ వర్మ, రీజినల్ సెక్రటరీ శ్రీనివాస్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలి

పాతమంచిర్యాల: పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు భూమి హక్కు పత్రాలు ఇవ్వాలని, ఎరువులు సకాలంలో సరఫరా చేయాలని, నకిలీ విత్తనాలను సరఫరాను అరికట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాల దందా కొనసాగుతోందని, సరఫరా చేసే దళారులను పట్టుకోవడంలో వ్యవసాయ అధికారులు, టాస్క్‌ఫోర్సు పోలీసులు విఫలం అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు యూడీఐడీ కార్డులు

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్‌సెల్ బాధితులకు వికలాంగుల సదరం యూడీఐడీ కార్డుల సర్టిఫికెట్ల కోసం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సదరం క్యాంపునకు హాజరు కావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు వికలాంగుల సదరం యూడీఐడీ కార్డుల సర్టిఫికెట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు ప్రొఫెసర్ వేదవ్యాస్, జనరల్ ఫిజీషియన్ వైద్యుడు అనురాగ్, పాథాలజిస్టు సుగుణాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, శంకర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.